ANDHRA JYOTHI

27 MAY 2020

## అధికారుల కృషి ప్రశంసనీయం: మంత్రి మల్లాడి

యానాం, మే 26: కరోనా నియంత్రణకు పోలీసులు, అధికారులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. పుదుచ్చేరిలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుదుచ్చేరిలో రోజురోజుకు కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్నాయన్నారు. యానాంలో ఒక కేసు కూడా నమోదు కాలేదన్నారు. ఒక కేసు వచ్చినా రెడ్‌జోన్‌లోకి వస్తుందన్నారు. పనిలేకుండా ఇంటి నుంచి ఎవరూ బయటకు రావద్దని మంత్రి కోరారు.

ENADU

27 MAY 2020



యానాంలో ప్రవేశించేందుకు బారులుదీరిన వాహనచోదకులు

## యానాం చెక్‌పోస్టులలో తనిఖీలు కట్టుదిట్టం

**యానాం:** తూర్పు గోదావరి జిల్లాలో కరోనా కేసుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఇతర ప్రాంతాల వారు యానాంలోకి అనుమతి లేకుండా ప్రవేశించకుండా తనిఖీలు కట్టుదిట్టం చేశారు. యానాంలోకి ప్రవేశించేందుకు వైఎస్‌ఆర్ చెక్‌పోస్టు, వంతెన చెక్‌పోస్టుల వద్ద ఓటరు గుర్తింపు కార్డులున్నవారిని మాత్రమే అనుమతించి, ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేనివారిని వెనక్కి పంపేస్తున్నారు. ఈ ప్రక్రియను మంగళవారం పరిపాలనాధికారి శివరాజ్‌మీనా, పోలీసు, ఇతర శాఖల అధికారులు దగ్గరుండి పరిశీలించారు. తనిఖీల కారణంగా వందల సంఖ్యలో వాహనాలతో జనంబారులుదీరుతున్నారు.

**యానాం :** కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై దగ్గర్లోని పోలీస్ స్టేషను, ఆరోగ్యశాఖ టోల్ ఫ్రీ నంబరు 18004252303కు ప్రజలు ఫిర్యాదు చేయాలని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ కార్యదర్శి దిలీప్‌కుమార్ పాండా విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చినవారు నిబంధనల మేరకు గృహ, ప్రభుత్వ క్వారెంటైన్‌లో ఉండకుండా బయట తిరుగుతుంటే చుట్టుపక్కల వారు తక్షణమే ఫిర్యాదు చేయాలని కోరారు.

27 MAY 2020

SAKSHI

27 MAY 2020

## యానాంలో మద్యం అమ్మకాలపై ప్రతిష్ఠంభన

యానాం: పుదుచ్చేరి, కారైకల్‌లో మద్యంషాపులు సోమవారం నుంచి తెరుచుకున్నప్పటికీ భౌగోళికంగా తూర్పుగోదావరి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న యానాంలో మాత్రం మద్యం అమ్మకాలు ప్రారంభం కాకపోవడంతో రాజ్‌నివాస్ నుంచి అనుమతి కోసం లిక్కర్ వ్యాపారులు ఎదురు చూస్తున్నారు. యానాంలో 7 హోల్‌సేల్ మద్యం షాపులు, 6 రిటైల్ మద్యం షాపులు ఉన్నాయి. అయితే లాక్‌డౌన్ నేపథ్యంలో మార్చి 24 నుంచి మద్యం షాపులను మూసివేశారు. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ నుంచి మద్యం విక్రయాలకు ప్రభుత్వం మినహాయింపు ఇస్తూ కేబినెట్ తీర్మానించింది. ఈ మేరకు మద్యంపై ప్రత్యేక కోవిడ్ ట్యాక్స్‌ను వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే పక్కరాష్ట్రాల నుంచి మద్యం తక్కువ ధరలు ఉన్న పుదుచ్చేరికి మందుబాబులు రాకుండా చేయాలని ఆవిధంగా కరోనా వ్యాప్తిని రాకుండా అరికట్టాలంటే మద్యం పై సరిహద్దు రాష్ట్రాలతో సమానంగా ట్యాక్స్‌ను వేయాలని ఆవిధంగా పుదుచ్చేరి, కారైకల్ లలో 100 శాతం, కేరళ సరిహద్దులో ఉన్న మాహేలో 150 శాతం, ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దునున్న యానాంలో 200 శాతం ట్యాక్స్‌లను పెంచాలని ఎల్జీ కిరణ్‌బేడీ ప్రభుత్వానికి సూచించారు. దీంతో ఎల్జీ ఆదేశాల మేరకు పెంచిన ట్యాక్స్‌లను ప్రభుత్వం సైతం ఆమోదించక తప్పని పరిస్థితి ఏర్పడింది.




యానాంలో మద్యం షాపుల వద్ద ముందస్తుగా కట్టిన బారికేడ్లు

**ఏపీ మద్యం ధరలు పట్టిక ఇవ్వకే ఆలస్యం...**

ఆంధ్రప్రదేశ్‌లో మద్యం బ్రాండ్‌ల ధరల పట్టిక ఫైల్ రాజ్‌నివాస్‌కు చేరలేదని తెలిసింది. దీని వల్లే యానాంకు సంబంధించి నిర్ణయం వెలువడలేదని చెబుతున్నారు. ఏపీ ధరలు లిస్టు ఆధారంగా 200 శాతం కరోనా ట్యాక్స్‌ను విధించి యానాంలో మద్యం బ్రాండ్‌ల ధరలను నిర్ణయించనున్నారు. ఇప్పటికే తమిళనాడు మద్యం బ్రాండ్‌లను తెలపడంతో కారైకల్, పుదుచ్చేరిలకు అనుమతివచ్చింది. యానాంకు ప్రధాన ఆదాయ వనరులుగా మద్యం, పెట్రోలియం ఉత్పత్తులు ఉన్నాయి. ఇప్పటివరకు మద్యం ధరలు తక్కువగా ఉండటంతో రెవెన్యూ సైతం దీనిపై ఎక్కువగా వస్తుంది. మరోవైపు కరోనా పాజిటివ్ కేసులు జిల్లాలో ఎక్కువ అవుతుండటం ఆందోళన కల్గిస్తుందని అంటున్నారు.

## స్వదేశానికి వచ్చేందుకు వందే భారత్ మిషన్

యానాం: కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ కారణంగా ఫ్రాన్స్‌లో చిక్కుకుపోయిన భారత పౌరులను, ఫ్రెంచిపౌరసత్వం కల్గి ఓసీఏ కార్డు ఉన్నవారిని భారత ప్రభుత్వం వందేభారత్ మిషన్ ద్వారా తిరిగి స్వదేశానికి తీసుకురావడానికి నిర్ణయించిందని, ఈ నేపథ్యంలో సంబంధిత వారు ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకోవాలని ఫ్రాన్స్‌లోని భారతరాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసిందని యానాంలో ఫ్రెంచి ప్రతినిధి సాధనాల బాబు మంగళవారం తెలిపారు. ఫ్రాన్స్‌లో స్థిరపడ్డ యానాం వారు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## యానాంలో..

యానాం: లాక్‌డౌన్ నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాత్రికేయులకు మంగళవారం యానాంకు చెందిన కాంట్రాక్టర్ దవులూరి సత్తిబాబు ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దున్నా చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.